క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

కమలాపూర్ : మండలంలోని శనిగరంకు చెందిన బండ శ్రీనివాస్ ఇంట్లో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పట్టుకున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనిగరంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారనే సమాచారం మేరకు బండ శ్రీనివాస్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా రూ.75 వేల విలువచేసే 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని చర్లపల్లి గ్రామంలో దాడులు నిర్వహించగా తూర్పాటి శ్రీధర్ 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు తెలిపారు. వీటి విలువ రూ.72 వేలు ఉటుంది తెలిపారు. శ్రీధర్‌ని అదుపులోకి తీసుకొని పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కమలాపూర్ : మండలంలోని గుండేడుకు చెందిన సిలువేరు కేతమ్మ (55) అనారోగ్యంతో బాధ పడుతూ ఈనెల 12న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కేతమ్మ.. మానసిక క్షోభకు గురై జీవితంపై విరక్తి చెంది ఈనెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి భర్త అయిలుకొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కమలాపూర్ : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాలోని మానేరు వాగు నుంచి హనుమకొండకు ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను మండలంలోని అంబాలలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. జమ్మికుంట మండలం గోవిందాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పుట్టల కిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

ఎండు గంజాయి పట్టివేత

ఐనవోలు : రూ.5వేల విలువచేసే 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం వనమాలకనపర్తి శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద నుంచి పారిపోవడాన్ని పోలీసులు గమనించారు. అనుమానం వచ్చి వారిని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులు రాహుల్, ప్రమోద్‌కుమార్, వంశీని తనిఖీ చేయగా వారినుంచి 200 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై వస్తం శ్రీనివాస్ తెలిపారు.

రౌతు మనోహర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం

పరకాల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన రైతు మనోహర్ జీవితం నేటికి ఆదర్శమని, ఆయన ఆశయ సాధన కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఎం సీనియర్ నేత, కామ్రేడ్ రౌతు మనోహర్ నాల్గో వర్ధంతిని ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పట్టణంలో గురువారం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కూడలిలోని రౌతు మనోహర్ స్థూపానికి, చిత్రపటానికి నివాళులర్పించారు. పరకాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చక్రపాణి, తిరుపతి, సీనియర్ జర్నలిస్టు మొగిళి, మార్కెట్ మాజీ డైరెక్టర్ చిరంజీవి, ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ జగన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు ఈశ్వర్, పట్టణ కార్యదర్శి సాయితేజ, శ్రీరామ్, రమేశ్, అజయ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ లైట్ల అందజేత

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలోని మైదానంలో ఉదయం 7గంటల లోపు, సాయంత్రం వేళలో వాకింగ్, క్రీడలు ఆడుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని గ్రామ యువకులు సంప్రదించగా 120 మెగావాట్ల విద్యుత్ లైట్లను అందజేసినట్లు తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సతీష్‌ముదిరాజ్ తెలిపారు. రాజేందర్, సునీల్, అనిల్ రాకేష్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో బస్కె లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఛత్రపతి శివాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యాన్ని అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రాజు, రవి, భిక్షపతి, మధు, రమేశ్, సునీల్, అఖిల్, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకే ఎసరు..!

పట్టా పాస్‌బుక్కులు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు

- ఓ మాజీ ప్రజాప్రతినిధి పేరిట 2.06 ఎకరాల జారీ
- లబోదిబోమంటున్న బాధితులు
- ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు

'40 ఏళ్ల క్రితం అతడి తండ్రి నుంచి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని విక్రయదారుడి కుమారుడిని బ్రతిమిలాడుకున్నారు. రిజిస్ట్రేషన్‌కు, దారి ఖర్చులకు అయ్యే డబ్బులు తామే భరిస్తామని నచ్చజెప్పారు. సరేనని తలూపిన సదరు విక్రయదారుడి కుమారుడు.. రెవెన్యూ పాత రికార్డులపై కన్నేశాడు. కొందరు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని తన తండ్రి పేరిట పాత రికార్డుల్లో ఉన్న భూమిని తన పేరిట పట్టా చేసుకున్నాడు. మండలంలోని శ్రీరాములపల్లిలో రెవెన్యూ అధికారులు చేసిన లీలలకు బాధిత రైతులు లబోదిబోమంటూ కలెక్టర్ కార్యాలయానికి పరుగులు పెట్టారు. తమ భూమిని తమ పేరిట పట్టా చేసి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.'

– కమలాపూర్



శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం



ఇళ్ల స్థలాలకు జారీ చేసిన పట్టా పాస్‌బుక్కు

విషయం ఏమిటంటే..

ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాలకు రెవెన్యూ అధికారులు పట్టా పాస్ బుక్కులు జారీ చేసిన ఘటన మండలంలోని శ్రీరాములపల్లిలో వెలుగు చూసింది. సుమారు 20కి పైగా కుటుంబాలు 40 ఏళ్ల క్రితం గ్రామంలో భూములు కొనుగోలు చేసుకుని ఆ భూముల్లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. రోజురోజుకు గ్రామ జనాభా పెరిగిపోయి ఆ భూములు కాస్తా గ్రామకంఠంలో కలిసి రికార్డుల్లో ఇళ్ల స్థలాలుగా నమోదయ్యాయి. ఇళ్ల స్థలాలుగా రికార్డుల్లో నమోదైన భూములను పట్టా చేయడానికి వీలు లేదని రెవెన్యూ చట్టం చెబుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు ఒకరి పేరిట పట్టా చేసి పాస్‌బుక్కు జారీ చేశారు. శ్రీరాములపల్లికి చెందిన తాటిపాముల చంద్రమౌళి అదే గ్రామానికి చెందిన చిలువేరు పాపయ్య నుంచి సుమారు 35 ఏళ్ల క్రితం 287/ఏ/2 సర్వే నంబరులో విడతల వారిగా మొత్తం 26 గుంటల భూమిని కొనుగోలు చేసి అందులో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాడు. ఇటీవల పాపయ్య కుమారుడు, గ్రామ మాజీ సర్పంచ్ చిలువేరు శ్రీనివాస్‌ను కలిసి తాను మీ తండ్రి నుంచి కొనుగోలు చేసిన భూమిని తన పేరిట రిజిష్టషన్ చేసి ఇవ్వాలని, అందుకయ్యే ఖర్చు తాను భరిస్తానని చెప్పాడు. ఇందుకు అంగీకరించిన శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను మచ్చిగా చేసుకుని 286/సీ/2లో 9 గుంటలు, 287/ఏ/2లో 1.11 ఎకరాలు, 287/ఈ/2లో 26 గుంటలు చొప్పున మూడు సర్వే నంబర్లలో మొత్తంగా 2.06 ఎకరాల భూమిని గతేడాది సెప్టెంబర్‌లో తన పేరిట పట్టా చేసుకుని పాసు బుక్కు పొందాడని చంద్రమౌళితో పాటు చిలువేరు మహేందర్ తదితరులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న బాధిత గ్రామస్తులు లబోదిబోమంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పరుగులు పెట్టారు. ఇళ్ల స్థలాలకు ఇచ్చిన పట్టాను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని తమ భూములు తమకు అప్పగించాలని కోరుతూ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు పట్టా పొందిన సదరు వ్యక్తితో పాటు బాధ్యులైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

8 గుంటలు ఇస్తే పట్టా చేస్తాడట..



తాను కొనుగోలు చేసిన భూమిని తన పేరిటే పట్టా చేసేందుకు రూ.1.50 లక్షలు ఖర్చవుతుందంటే అంత డబ్బు ఇచ్చాను. తీరా ఆ భూమిని అతడి పేరిట పట్టా చేసుకుని పాస్‌బుక్కు పొందాడు. ఇప్పుడా భూమిని నా పేరుపై చెయ్యమంటే మా అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లు నలుగురికి తలో 2 గుంటల చొప్పున మొత్తం 8 గుంటలు ఇస్తేనే చేస్తానని మాట మార్చాడు.

– తాటిపాముల చంద్రమౌళి, బాధితుడు

మా భూమి మాకు ఇప్పియ్యాలి



నేను 30 ఏళ్ల కింద భూమి కొనుక్కొని 25 ఏళ్ల కింద ఇల్లు కట్టుకొని ఉంటున్నాను. మా ఇల్లు గ్రామపంచాయతీ రికార్డుల్లో కూడా నమోదై ఉంది. ఇంటి పన్ను, నల్లా పన్ను కడుతున్నాం. మా భూమిని వాళ్ల పేరుపై పట్టా చేసుకున్న విషయం తెలిసి ఖంగు తిన్నాం. మా భూమి మాకు ఇప్పించి నాయ్యం చెయ్యాలి.

– చిట్టిపోతుల చంద్రమౌళి, బాధితుడు

ఉన్నతాధికారులకు తెలిపాం..

శ్రీరాములపల్లిలో ఇళ్ల స్థలాలకు పట్టా పాస్‌బుక్‌లు జారీ చేసిన విషయం నాకు తెలియదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఇటీవల విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం. వారి ఆదేశానుసారం నుడుకుంటాం.

– శోభారాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్

రెవెన్యూ అధికారులపై చర్య తీసుకోవాలి



మాజీ సర్పంచ్ శ్రీనివాస్ వాళ్ల భూమితో పాటు మా భూమి కూడా పట్టా చేసుకున్నాడు. మా భూమిని గతంలో పట్టా చేయమని రెవెన్యూ అధికారులను అడిగితే ఆ భూమి ఇళ్ల స్థలాల కింద ఉందని, చెయ్యరాదని చెప్పారు. మరి ఇప్పుడెలా పట్టా చేశారో తెలియడం లేదు. చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలి.

– చిలువేరు మహేందర్, బాధితుడు

కడియం తీరు నచ్చక బీఆర్ఎస్‌లోకి వలసలు

- మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు



మాట్లాడుతున్న భూపతిరాజు

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరు నచ్చకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ ఇట్టబోయిన భూపతిరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆధ్వర్యంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలవడంతో కడియం శ్రీహరి అనుచరులకు భయం పట్టుకుందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని, కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరి ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులకు తిరిగి శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టంతో గెలిచిన కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో విసుగు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితోనే మండలానికి సాగునీరు, అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రూ.700 కోట్ల నిధులు అభివృద్ధి పనులకు తీసుకువచ్చానని కడియం శ్రీహరి గ్లోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ సురేశ్, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, నాయకులు జాని, ప్రభాకర్ రెడ్డి, మహేందర్, కిరణ్, శ్యామ్, సాంబయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీఓ సుధీర్



మాట్లాడుతున్న ప్రకాశ్

- అడిషనల్ డీఆర్డీఓ సుధీర్

ఎల్కతుర్తి : గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని అడిషనల్ డీఆర్డీఓ సుధీర్ సూచించారు. గురువారం బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సభ్యులకు, అంగన్‌వాడీ కేంద్ర సిబ్బందికి పౌష్టికాహారంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు ఒత్తిడి లోనవ్వద్దని అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణులు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సూచించారు. సేంద్రియ ఎరువులతో సాగుచేసిన కూరగాయలను తీసుకుంటే బలంగా ఆయురారోగ్యాలతో ఉంటారని అన్నారు. ఏపీఎం దేవానంద్, మండల సమాఖ్య సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

శాయంపేట : పౌష్టికాహారంతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని, తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నాన్‌ఫామ్ అండ్ హెచ్‌డీ డీపీఎం ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం వీఓఏలకు, వీఓ అధ్యక్ష, కార్యదర్శులకు, వీఓ హెల్త్ సబ్ కమిటీ సభ్యులకు ఆహారం, పౌష్టికాహారం, ఆరోగ్యం వాష్ కార్యక్రమాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. మహిళలు, పురుషులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పాలు, కోడిగుడ్లు, ఆకుకూరలు, పప్పు దినుసులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీ ఏపీఎం శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, సీసీలు కేదారి, విజయ్‌కుమార్, ప్రభాకర్, హేమలత, సురేఖ, మండల సమాఖ్య అధ్యక్షురాలు శిరిష, వీఓఏలు, వీఓలు, అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 69శాతం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న సాంబయ్య

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలో తమిళనాడు రాష్ట్రం తరహాలో చట్టసభల్లో బీసీలకు 69శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి వంగర సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టి 2011లో ఉన్న బీసీ జనాభా సంఖ్యను కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించి బీసీల గొంతు నొక్కుతుందని ఆరోపించారు. ప్రభుత్వం బీసీల సంఖ్య తగ్గించి అగ్రకులాల సంఖ్యను పెంచడం ప్రభుత్వంలో ఉన్న అగ్రవర్ణ కులాల కుట్రనేనని మండిపడ్డారు. 5శాతం లేని అగ్రకులాలు ఈడబ్ల్యూస్ పేరుతో 10శాతం విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందడం మోసపూరితమైన చర్య అని అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం ఇస్తామన్న బీసీ రిజర్వేషన్ ద్వారా ఎవరికి న్యాయం జరుగుతుందని ఆయా పార్టీల్లో ఉన్న బీసీ నాయకులు ఆలోచించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కుట్రను తిప్పికొట్టాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అగ్రవర్ణాల నాయకులు, ఎమ్మెల్యేలతో కలిసి బీసీ నాయకులను, కార్యకర్తలకు అన్యాయం చేస్తుందని విమర్శించారు.

సరోజినీనాయుడు కృషి మరువలేనిది



కమలాపూర్ : ఆంగ్ల భాష ప్రాముఖ్యతను తెలుపుతూ వేసిన పటం

ధర్మసాగర్ : భారతీయ సాహిత్యం, ఆంగ్లభాషాపై సరోజినీనాయుడు చేసిన కృషి మరువలేనిదని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. భారత కవి కోకిల దివంగత సరోజిని నాయుడు జయంతిని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, ఆంగ్ల భాషా ఉపాధ్యాయ రాష్ట్ర సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆంగ్ల భాషా ప్రాముఖ్యతను అభ్యాసాన్ని ప్రోత్సహించడం, విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత వెలికితీయాలని అన్నారు. సరోజిని నాయుడు రాసిన ఆంగ్ల కవిత్వం, స్వాతంత్ర్య పోరాటంలో ఆమె పాత్రపై, రచనలపై వ్యాసరచన పోటీలు, పోస్టర్ డిజైన్, స్లోగన్ రైటింగ్, కవితల పోటీలు, ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఉపాధ్యాయులు కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మమత, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్ : భారతదేశ తొలి మహిళా గవర్నర్, నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజినీనాయుడు జయంతిని మండలంలోని ఉప్పల్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఆంగ్ల భాషా దినోత్సవంగా నిర్వహించారు. సరోజినినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆంగ్ల భాషా ప్రాముఖ్యత, గ్రామర్‌ను వివరిస్తూ పటాన్ని రూపొందించి ఆంగ్ల భాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వాణి, ఆంగ్ల భాషోపాధ్యాయులు సంపత్‌కుమార్, నయీంపాషా, శ్రీధరాచారి, ఉపాధ్యాయులు ఉమాదేవి, రేవతి, రామకృష్ణయ్య, శర్మిల, రాజేందర్, కొమురయ్య, ఇందిరారాణి, కిరణ్, సుమలత, పాపయ్య, కోమల, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భక్తుల మొక్కులు



అగ్రంపహాడ్‌లో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ మినీ జాతరలో గురువారం భక్తుల మొక్కులు కొనసాగాయి. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి చీర, సారె, బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైద్యశిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ జాతరలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి భక్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. డాక్టర్ నర్సింగరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి భూమిపూజ



దామెర : మండలంలోని కోగిల్వాయి గ్రామంలో పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి ముదిరాజ్ సొసైటీ చైర్మన్ జంగిలి వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డాక్టర్ కాశీప్రసాద్‌రావు హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెద్దమ్మతల్లి అనుగ్రహం గ్రామ ప్రజలపై ఉండాలన్నారు. గుడి నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ముదిరాజ్ సొసైటీ చైర్మన్ బండి సారంగపాణి, మాజీ చైర్మన్ మల్లేషం, కమిటీ సభ్యులు నాగరాజు, రవి, కిరణ్, బాబు, వేణు, సాంబయ్య, మల్లేష్, సారంగపాణి, సమ్మయ్య, నర్సయ్య, సమ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉప్పల్' పోరాటం

- రోడ్డుపై వంటావార్పు చేసిన గ్రామస్తులు



రోడ్డుపై అల్పాహారం తింటున్న గ్రామస్తులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌ను నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం వంటావార్పు చేపట్టారు. స్థానిక కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై వంటావార్పు చేపట్టి అల్పాహారం చేశారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. మండల సాధన సమితి నాయకులు, గ్రామస్తులు మాట్లాడుతూ.. నూతన మండల ఏర్పాటుకు అవసరమైన అన్ని అర్హతలు, వసతులు, వనరులు ఉన్న ఉప్పల్‌ను నూతన మండలంగా ప్రకటించాలని కొద్ది రోజులుగా నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఇప్పటికైనా వెంటనే ఉప్పల్‌ను నూతన మండలంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉప్పల్‌ను మండలంగా ప్రకటించని యెడల రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించి నిరసన, ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు ఆందోళన కారులతో మాట్లాడి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు నవీన్‌కుమార్, సంపత్‌రావు, దేవేందర్‌రావు, రాజు, రాజమౌళి, రాణాప్రతాప్, మండల సాధన సమితి నాయకులు, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థాయి : దామోదర్



మాట్లాడుతున్న దామోదర్

కమలాపూర్ : విద్యతోనే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని మోటివేషనల్ స్పీకర్, సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. కమలాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం నిర్వహించిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన, పేద వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని, అందుకోసం పాఠశాల దశ నుంచే కష్టపడి చదవాలన్నారు. నిత్యం సమాజంలో పెరుగుతున్న సమాజ విరుద్ధ పోకడలకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌ను నాశనం చేసే ప్రలోభాల వైపు వెళ్లకూడదన్నారు. ఎవరి భవిష్యత్‌కు వారే నిర్మాతలని, అందుకోసం ప్రతిఒక్కరూ ఆసక్తి ఉన్న రంగాల్లో లక్ష్యాన్ని ఎంచుకొని సాధించుకోవాలని సూచించారు. టీనేజ్‌లో వచ్చే రకరకాల ఉద్వేగాలను నియంత్రించుకోవాలన్నారు. మహానుభావుల జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తి, ప్రేరణ పొందాలని, మీ ఎదుగుదల తల్లిదండ్రులకు గర్వకారణంగా ఉండాలన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, జిల్లా కార్యదర్శి తరాల యుగేందర్, సభ్యులు లక్ష్మీనారాయణ, రవీందర్, ఎస్ఓ అర్చన, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన కత్తుల భిక్షపతి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న శ్రీమల్లికార్జున యాదవ యూత్ పరపతి సంఘం కార్యవర్గం గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 10వేల ఆర్థికసాయం అందించారు. ఆ సంఘం అధ్యక్షుడు నల్లబెట్ట రాజు, చిన్నరాజు, రమేశ్, అశోక్, రాజు, రాజశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు



మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

ఎల్కతుర్తి : త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని బారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో గల ఓ గార్డెన్‌లో మండల అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఆర్టికల్ 370 కోసం పోరాటం చేసిన చరిత్ర బీజేపీకి ఉందన్నారు. పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి అంజిరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. నియోజకవర్గ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ మండల ఇన్‌చార్జ్ పైడిపెల్లి పృథ్వీరాజ్, నాయకులు కొమురయ్య, కుమార్, సారయ్య, శివ, శ్రీనివాస్, కవిత, వేణు, రాజు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం



దామెర : రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన పలు పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాను తమకు ఇవ్వలేదని తాము చూడకుండా అభ్యంతరాలు ఎలా తెలపాలని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాను ఇవ్వమని ఎంపీడీఓను అడిగితే ఆన్‌లైన్ లింక్ పంపిస్తామని అందులో చూసుకోవాలని అనడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా ఇవ్వకుండా తమను అవమానిస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు ముఖేష్, రమేశ్, కాంగ్రెస్ నాయకులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.